క్లుప్తంగా

నేడు ఆర్బీకే ప్రారంభోత్సవం

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లిలో రూ.22 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

ధర్మవరం: ఇటీవల కలకత్తాలో జరిగిన కరాటే నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ధర్మవరానికి చెందిన శిరిపి వెంకటేష్ ద్వితీయ స్థానంలో నిలిచి, సత్తా చాటాడు. శనివారం ధర్మవరానికి వచ్చిన వెంకటేష్‌ను భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ముక్తం ఈశ్వరయ్య, కోచ్ రాము, మణిదీప్, గుర్రప్ప, రమణ, హరీష్ తదితరులు ఘనంగా సన్మానించారు.

కల్యాణోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే కేతిరెడ్డిని సత్కరిస్తున్న పద్మశాలీ బహుత్తమ సంఘం నాయకులు

ధర్మవరం: పట్టణంలోని మార్కెట్ వీధిలో ఉన్న మార్కెండేయ స్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ జరిగే భద్రావతి భావనా రుషీంద్రుల 57వ కల్యాణ మహోత్సవానికి రావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని పద్మశాలీయ బహుత్తమ సంఘం నాయకులు శనివారం ఆహ్వానించారు. 30వ తేదీన బిందె సేవ (గంగపూజ), 31న భద్రావతి భావనా రుషీంద్రుల కల్యాణం, అన్నదానం, సాయంత్రం ఉత్సవమూర్తుల గ్రామోత్సవం, ఫిబ్రవరి 1వ తేదీన వసంత మహోత్సవం, సాయంత్రం డోలోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న శింగరయ్య, ఉపాధ్యక్షులు జింకా రామంజనేయులు, ప్రధాన కార్యదర్శి జింకా చిన్నప్ప, సహాయ కార్యదర్శి బొడగల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

ఎన్‌పీకుంట: మండలంలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు కేంద్ర బృందం సభ్యులు పర్యటించనున్నట్లు ఎంపీడీఓ ఆదినారాయణ, ఏపీఓ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. కేంద్ర బృందం సభ్యులు ఆదివారం బలిజపల్లి, మరికొమ్మదిన్నె, సోమవారం ఎన్.పీ.కుంటలో పర్యటించి ఉపాధిహామీ పథకంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలిస్తారన్నారు. అధికారులు, ప్రజలతో సమావేశం అవుతారని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

ముదిగుబ్బ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండగలమని పీవీఎస్ స్కూలు విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం పట్టణ పురవీధుల్లో ప్లకార్డులతో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ చేపట్టారు. విద్యార్థి దశలోనే పరిశుభ్రతను పాటించడం అలవాటు చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని నినాదాలు చేశారు. పురవీధుల్లో చెత్తా చెదారాన్ని స్వయంగా ఎత్తి శుభ్రం చేశారు. బస్టాండ్ కూడలిలో మానవ హారాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన నృత్యప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి.వెంకటనాయుడు పాల్గొన్నారు.

పరామర్శ

పుట్టపర్తి: బుక్కపట్నం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాగభూషణ గుప్తా అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి చేరుకుని మృతుడికి నివాళి అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటచౌదరి, సర్పంచ్ ఉస్సేన్, ఎంపీటీసీ కేశవనాయుడు పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

ఓడీ చెరువు: మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ సమీపంలో సుబ్బయ్యనారవ వద్ద మహమ్మదాబాద్ రోడ్డుపై శనివారం బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలు.. అమడగూరు మండలం గొల్లపల్లికి చెందిన అమరనాథ రెడ్డి భార్య రాజేశ్వరి కొండ్రెడ్డిపల్లి నుంచి ద్విచక్ర వాహనంలో తండ్రితో కలసి గొల్లపల్లికి బయలుదేరింది. మహమ్మదాబాద్ క్రాస్ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో రాజేశ్వరి కింద పడింది. ఆమె తల, చేతులకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108లో కదిరికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కదిరి నుంచి అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కేబుల్ దొంగల అరెస్ట్

పుట్టపర్తి: ఈనెల 26, 27 తేదీల్లో బుక్కపట్నం మండల పరిధిలోని మదిరెబైలు, చిలకలగడ్డపల్లి, కొట్టాల గ్రామాల్లో బోరు కేబుల్ చోరీకి గురైన విషయం తెలిసిందే. సీఐ జయానాయక్ ఆదేశాలతో దర్యాప్తు చేపట్టి చోరీకి పాల్పడిన వారిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు పేర్కొన్నారు. లింగప్పగారిపల్లికి చెందిన చంద్రబాబు, నగిరి నరేష్, ఉమినేని నరేష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. చోరీకి పాల్పడినపుడు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి వారి ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

కనుల పండువగా రథసప్తమి





ధర్మవరం అర్బన్: సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీచెన్నకేశవుడు, శేషవాహనంపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుడు



శ్రీనివాసనగర్ వేంకటేశ్వరుడిని ఊరేగిస్తున్న భక్తులు

- వాహనాల్లో ఊరేగిన లక్ష్మీచెన్నకేశవ స్వామి, వేంకటేశ్వరుడు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన ఏడు వాహనాల్లో ఊరేగారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో గంటకో వాహనంపై కొలువుదీరిన చెన్నకేశవస్వామి ఆద్యంతం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ సూర్యప్రభ వాహనం, 8 నుంచి 9 గంటల వరకూ శేష వాహనం, 10 నుంచి 11 గంటల వరకూ గరుడ వాహనం, 12 1 గంట వరకూ హనుమంత వాహనం, 3 నుంచి 4 గంటల వరకూ కల్పవృక్ష వాహనం, 5 నుంచి 6 గంటల వరకూ సర్వభూపాల వాహనం, 7 నుంచి 8 గంటల వరకూ చంద్రప్రభ వాహనాలపై లక్ష్మీ చెన్నకేశవుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి పురవీధుల్లో ఊరేగగా.. భక్తులు హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే శ్రీనివాసనగర్‌లోని వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం స్వామి విగ్రహాన్ని సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కొత్తపేట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యప్రభ వాహనంపై స్వామిని ఊరేగించారు.

బత్తలపల్లిలో..

బత్తలపల్లి: మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలోని ఓంకారేశ్వరుడికి ఆలయ ప్రధాన అర్చకుడు కేశవ స్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం రథసప్తమిని పురస్కరించుకుని ఉదయం సూర్యకిరణాలు ఓంకారేశ్వరుడికి తాకగానే శివమాలధారులు భజనలు చేశారు. అలాగే లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, ద్రాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

పోతులనాగేపల్లి పాఠశాలలో..

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతులనాగేపల్లి మండల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సూర్యనారాయణ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సూర్య నమస్కారాలు, యోగా తదితర వాటి గురించి వివరించారు. ఏపీయూఎస్ జిల్లా కోశాధికారి అన్నం అరవింద్, పంచాయతీ కార్యదర్శి మురళి, ఉపాధ్యాయులు రమేష్, జయప్రద, చలపతి, సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ విజయ్ పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: రోజూ యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం అలవడుతుందని యోగా గురువు గొర్ల నారాయణరెడ్డి తెలిపారు. రథసప్తమి సందర్భంగా శనివారం ఓం ఆదిగురు ఉచిత యోగా కేంద్రం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో 108 సూర్య నమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్ నీలూరు వెంకట్రాముడు హాజరయ్యారు. యోగా సాధకులతో సూర్య భగవానుడి బీజమంత్రాలను ఉచ్చరిస్తూ 108 సూర్య నమస్కారాలు చేయించారు. రోజూ ఒక గంట సమయాన్ని యోగా కోసం వినియోగిస్తే అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం బహుమతులు అందించారు.

ధర్మవరం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో..

స్థానిక సాంస్కృతిక మండలిలో రథసప్తమి సందర్భంగా ధర్మవరం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాలు చేశారు.



బత్తలపల్లి: పూజలందుకున్న ఓంకారేశ్వరుడు

అనంతరం సూర్య భగవానుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో సాంస్కృతిక మండలి ఫౌండర్ సత్రసాల ప్రసన్నకుమార్, విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచర్ల వేణుగోపాల్, యోగ మాస్టర్ రామన్న, తిరుమలేసు, ఈశ్వరయ్య, రవికుమార్, ఆర్గనైజర్ నరసింహ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చందు

రామగిరి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పేరూరుడ్యాం (అప్పర్‌పెన్నార్ ప్రాజెక్ట్)ను ఆయన సందర్శించారు. అధికారులతో కలిసి చెరువులో 4.58 లక్షల చేప పిల్లలను వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారన్నారు. పేరూరుడ్యాంకు హంద్రీనీవా ద్వారా నీరందించినట్లు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో నీరు ఉండడంతో చేపలను వదలడంతో ఉపాధి లభిస్తోందన్నారు. 25 ఏళ్లగా ఈ ప్రాంతానికి పరిటాల కుటుంబ సభ్యులే ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పనిచేశారని, అయినా పేదలకు న్యాయం జరిగింది లేదన్నారు. ఆర్డీఓ తిప్పేనాయక్, ఫిషరీస్ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐఎఫ్ జ్యోతి, ఎంపీపీ కర్రెన్న, తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ ఆజాద్, రామగిరి, కనగానపల్లి మండలాల జెడ్పీటీసీలు నాగార్జున, మారుతీప్రసాద్, కన్వీనర్లు రమేష్, అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచు రాజేష్, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలప్ప పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ధర్మవరం: మండలంలోని చిగిచెర్లలో నూతనంగా నిర్మించనున్న అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి సుప్రియ రూ.50 వేలు విరాళం అందించారు.

కదిరి అర్బన్: మండల పరిధిలోని ఎరుకులవాండ్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ దేవాలయ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి రూ.50 వేలు, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి రూ.30 వేల చొప్పున విరాళంగా అందజేశారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

నల్లచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్లిరెడ్డిపల్లి, కమ్మవారిపల్లి, బోయపల్లి, గురికానిపల్లి, కుమ్మరవాండ్లపల్లి గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్లను అందజేశారు. ఆయా వీధుల్లో మిగిలిపోయిన సీసీ రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. సీసీ రోడ్లకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇంటి స్థలాలున్న అర్హులకు పొజిషన్ సర్టిఫికెట్లను మంజూరు చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓతో మాట్లాడి అర్హులకు పింఛన్లు వచ్చేలా చూస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని చంద్రబాబు తన అనుకూల మీడియా ద్వారా అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలే చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, జెడ్పీటీసీ అనిత, సర్పంచులు గంగాదేవి, శ్రీనాథ్‌రెడ్డి, యూసుఫ్, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, రామలక్ష్మమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ నాగభూషణ, మాజీ టెంపుల్ చైర్మెన్ ఆనందరెడ్డి, మాజీ సర్పంచ్ అక్బర్, రవికుమార్‌రెడ్డి, రమణారెడ్డి, నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, లక్ష్మీపతియాదవ్, డాక్టర్ శంకర, హైదర్ వలి, నరసింహారెడ్డి, సుబ్బిరెడ్డి, వెంకటేషు, వేణు, మల్లిరెడ్డి, భాస్కర్, తిరుపాల్ పాల్గొన్నారు.



మల్లిరెడ్డిపల్లిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

నల్లచెరువు: స్థానిక జామీయా మసీదు నూతన ప్రభుత్వ ఖ్వాజీగా నియమితులైన పఠాన్ అమీర్‌ఖాన్ ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అక్బర్, నాయకులు బట్టీ హైదర్‌వలి, డాక్టర్ శంకర, కరీం, బషీర్, జిలాన్‌బాషా, హబీబ్, హిదాయతుల్లా పాల్గొన్నారు.

సీతారామ ఆలయ ప్రారంభోత్సవం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని సైదాపురం హరిజనవాడలో నూతనంగా నిర్మించిన సీతారామ దేవస్థానం ప్రారంభోత్సవంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొన్నారు. అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ నిర్మాణానికి సహకరించి తన వంతు సహాయంగా రూ.50 వేలు అందజేసిన ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సన్మానించారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు మురళి, సింగిల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ప్రమాదాల నివారణ

కదిరి అర్బన్: కదిరి ఆర్టీసీ డిపోను ప్రమాద రహిత డిపోగా నడిపిస్తున్న అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆర్టీసీ డిపో గ్యారేజీలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంవీఐతో పాటు సీఐ తమ్మిశెట్టి మధు, డీఎం మైనుద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. డిపోలో డ్రైవర్లతో పాటు, గ్యారేజీ సిబ్బంది, అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రమాద రహిత డిపోగా కదిరి డిపోను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. పట్టణంలోని ట్రాఫిక్ సమస్య లేకుండా నిర్దేశించిన పాయింట్లలోనే ఆర్టీసీ బస్సులు ఆపాలని చెప్పారు. అనంతరం 32 ఎళ్ల సర్వీసులో ఎలాంటి ప్రమాదం చేయని కుటాగుళ్ల రామచంద్ర అనే డ్రైవర్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు హరిత, హరిమోహన్,రామక్రిష్ణ,అసోసియేషన్ నాయకులు రమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో ఆర్టీసీ ముందంజ

ధర్మవరం అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణలో ఆర్టీసీ ముందంజలో ఉందని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలోని గ్యారేజీలో శనివారం ఆర్టీసీ డీఎం మోతిలాల్‌నాయక్ సమక్షంలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో జీరో పర్సెంటేజ్ తీసుకువచ్చేందుకు డ్రైవర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ఎంసీ వెంకటేషులు, ఆర్టీసీ యూనియన్ల నాయకులు నాగార్జునరెడ్డి, సుమోహీన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవీఐ వరప్రసాద్

సమన్వయంతో పట్టణాభివృద్ధికి బాటలు

పుట్టపర్తి టౌన్: పట్టణంలో అన్ని వార్డులనూ సమానంగా చూస్తూ, పార్టీలకు అతీతంగా పనులు, మౌలిక సదుపాయాలు కల్పించినప్పటికీ కౌన్సిల్ సమావేశంలో ఉనికిని చాటుకునేందుకు టీడీపీ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి అజెండా చించి ఆగ్రహం వ్యక్తం చేయడం సరికాదని మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి మండిపడ్డారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 5వ వార్డు కౌన్సిలర్ సూర్యాగౌడ్ మాట్లాడుతూ.. హనుమాన్ కూడలిలో రాజకీయ నాయకులు, వివిధ రకాల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిని పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. వార్డుల్లో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ఫాగింగ్ చేయాలన్నారు. వైస్ చైర్మన్ తిప్పన్న మాట్లాడుతూ.. 1వ వార్డు సాయి నగర్‌లో గ్రామ కంఠం భూమిని గతంలో ఇళ్ళు పట్టాలు ఇచ్చారని వాటిలో ఇళ్లు నిర్మించుకొన్నారని, వారిని వారు కొందరు చనిపోయారని వారి పేరున ఇళ్లకు వారసులకు మార్చాలని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కమిషనర్, చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కౌన్సిల్ దృష్టికి వచ్చిన సమస్యలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి వార్డులో శ్మశానం కోసం 3 ఎకరాల భూమిని కేటాయించామన్నారు. రూ.20 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి టెండర్లు ఖరారు చేశామని వెల్లడించారు. వీధిలైట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మెన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, ఏఈ స్వాతి, కో-ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ ఓబుళపతి

'జగనన్న ఊళ్లు నిర్మిస్తున్నారు'



గృహ మంజూరు పత్రాలను చూపుతున్న లబ్ధిదారులు

ఓడీ చెరువు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా ఊళ్లు నిర్మిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు అన్నారు. శనివారం మండలంలోని ఇనగలూరు, ఇ.గొల్లపల్లి, గాజుకుంటపల్లికి చెందిన లబ్ధిదారులకు ఆయా గ్రామాల సచివాలయాల్లో ఎంపీడీఓ పోలప్ప, తహసీల్దార్ శ్రీధర్ తదితరులు గృహ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ.. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులకు లంచాలు ఇస్తేనే పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం అవినీతికి చోటు లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉగాది నాటికి మూడు లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని గెలుపించాలన్నారు. జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రి సీటులో కూర్చోబెట్టాలన్నారు. కార్యక్రమంలో అగ్రి అడ్వైజరీ బోర్డు మండల చైర్మన్ లక్ష్మీరెడ్డి, పార్టీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బాబాఫక్రుద్దీన్, వీఆర్వో రమణ, నాయకులు వెంకటరెడ్డి, ఇమాంసాబ్, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీస్తున్న హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ నాయక్

చెన్నేకొత్తపల్లి: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ నాయక్ అధికారులను ఆదేశించారు. చెన్నేకొత్తపల్లి హౌసింగ్ లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేదకు సొంతింటి కల సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల కింద ఇళ్లు మంజూరు చేశారన్నారు. ఇళ్ల నిర్మానాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సిమెంట్, స్టీల్, ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. ఇంటి పట్టాలు మంజూరైన ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ నాయక్, హౌసింగ్ ఏఈ హరి కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ చక్రి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతో భవిష్యత్తు

ధర్మవరం అర్బన్: విలువలతో కూడిన విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆన్‌సెట్ మేనేజర్ సునీల్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు పావని తెలిపారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం యువజన సర్వీసుల శాఖ ఆన్‌సెట్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో మార్పు పాఠశాల నుంచి మొదలవుతుందన్నారు. విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని కేవలం మార్కులు, ర్యాంకుల కోసం కాకుండా విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. శారీరక వ్యాయామం, యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుని క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఆన్‌సెట్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, పోటీ పరీక్షలు తదితర వాటిని ముద్రించిన పుస్తకాలను పాఠశాల ఉపాధ్యాయులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో యువజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ మూర్తి, హెచ్‌ఎం శ్రీదేవి, మ్యూజిక్ టీచర్ రమణవాణి, ఆన్‌సెట్ ఇన్‌స్ట్రక్టర్ విజయకుమార్, జూనియర్ అసిస్టెంట్ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

నబీరసూల్‌కు ఉత్తమ సేవా పురస్కారం

ధర్మవరం: పేద ప్రజలకు విశేష సేవలందిస్తూ, అనువంశిక ఆయుర్వేదం పేరిట సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రముఖ పారంపర్య వైద్యుడు నబీరసూల్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో పారంపర్య వైద్యుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ బీఎంకే రెడ్డి, యూనివర్సిటీ డీన్ సావిత్రమ్మ, సెంటర్ ఫర్ కమ్యూనిటీ హెల్త్ అండ్ క్లినికల్ రీసెర్చ్ ప్రొఫెసర్ హరిరామమూర్తి తదతరుల చేతులమీదుగా నబీరసూల్ పురస్కారం అందుకున్నారు.

రహదారులపై తనిఖీలు

పుట్టపర్తి అర్బన్: ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం జిల్లాలోని పలు మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదారులపై ఎస్సైలు, సిబ్బంది మెరుపుదాడులు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని, అధిక లోడుతో వెళ్తున్న ఆటోలు, జీపులు, అక్రమ రవాణా చేస్తున్నారా? అని ప్రతి వాహనాన్ని ఆపి చెక్ చేసి పంపారు. డ్రైవర్లకు మద్యపాన పరీక్షలు నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలియజేస్తూ నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుము విధించారు.

గృహ సారథుల ఎంపిక

నల్లమాడ: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శనివారం గృహ సారథులను ఎంపిక చేసినట్లు పార్టీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్ తెలిపారు. చారుపల్లి, యర్రవంకపల్లి, వేళ్లమద్ది, కొండకింద తండా, వంకరకుంట, రెడ్డిపల్లి, కురుమాల, దొన్నికోట పంచాయతీల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఒక్కో గ్రామ వలంటీర్ పరిధిలో ఇద్దరు చొప్పున గృహ సారథులను నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.రామచంద్రారెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి పాల్గొన్నారు.

యోగి వేమన నాటక ప్రదర్శన

కదిరి టౌన్: పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో శనివారం రాత్రి ప్రేరణ వెల్ఫేర్ అసోసియేషన్ కదిరి ఆధ్వర్యంలో యోగి వేమన ఉచిత నాటకాన్ని ప్రదర్శించారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో హోండా షోరూం అధినేత కిషోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రంగారెడ్డి, కోటిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్ అప్పగింత

నల్లచెరువు: మండల పరిధిలోని బండ్రేపల్లి సమీపంలో రోడ్డుపై దొరికిన బ్యాగ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు యనమల సోమిరెడ్డి శనివారం పోలీసులకు అప్పగించారు. బ్యాగ్‌లో ల్యాప్‌ట్యాప్ ఉన్నట్లు తెలిపారు. తగిన ఆధారాలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఇళ్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా 7 గ్రామ సచివాలయాల పరిధిలో సొంత స్థలం ఉండి ఇళ్లు లేని వారు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి శనివారం తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్, బియ్యంకార్డు ఉపాధిహామీ కార్డు, బ్యాంక్ పుస్తకం నకళ్లతో సచివాలయాల్లో అందించాలని సూచించారు.

తలుపుల: జగనన్న ఇళ్లకు అర్హులైన వారిని గుర్తించాలని శనివారం ఎంపీడీఓ రామానాయక్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

నల్లమాడ: మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బీ.గంగులప్ప, ఉపాధ్యక్షుడిగా గంగులయ్య, కార్యదర్శిగా పీ.వేణుగోపాల్, సహాయ కార్యదర్శిగా మోహన్‌రెడ్డి, కోశాధికారిగా సోమశేఖర్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.